ఆటో షోలో వాహనాలు

ఆటో షో

గ్రాండ్ సక్సెస్

నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే ప్రయత్నానికి విశేష స్పందన

సందర్శకులతో సందడిగా హయగ్రీవాచారి మైదానం

వాహనప్రియులతో కిటకిటలాడిన స్టాళ్లు

కార్లు, బైక్స్ కొనుగోలు చేసిన వినియోగదారులు

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో హనుమకొండలోని కుడా హయగ్రీవాచారి మైదానంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఆటోషో గ్రాండ్ సక్సెస్ అయింది. తమ మనస్సుకు నచ్చిన బైకులు, కార్లు కొనాలనుకునే వారి కోసం ప్రముఖ కంపెనీల వాహనాలను ఒకే వేదికపైకి తీసుకురాగా నగరవాసుల నుంచి విశేష స్పందన వచ్చింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వాహనప్రియులు స్టాళ్లను సందర్శించి తమకు నచ్చిన బైక్‌లు, కార్లను టెస్ట్ రైడ్ చేయడంతో పాటు ఈవీలపైనా ఓ లుక్కేశారు. ప్రదర్శించిన అన్ని వాహనాలను తరచి చూసి వాటి వివరాలు తెలుసుకొని నచ్చిన వాహనాలను కొనుగోలు చేశారు. కొందరు లక్కీ డ్రాలో బహుమతులు గెలుచుకొని సంబురపడ్డారు. ఇలా శని, ఆదివారాల్లో కొనసాగిన ఆటోషో సందర్శకులతో కిటకిటలాడగా, వాహనాల ప్రేమికుల కోసం ఇలాంటి కార్యక్రమం ఏర్పాటుచేయడం అభినందనీయమని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

– హనుమకొండ చౌరస్తా, మార్చి 17

టెస్ట్ రైడ్ చేస్తున్న మహిళ

కస్టమర్లకు వాహన వివరాలు తెలియజేస్తున్న కంపెనీ ప్రతినిధి

ఆకట్టుకున్న ఈవీలు

ఆధునిక సాంకేతికతతో పాటు సరికొత్త ఫీచర్లతో వచ్చిన పలు కంపెనీల ఎలక్ట్రిక్ బైక్‌లు, కార్లు ఆటోషోలో ఆకట్టుకున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు కూడా పెరగడంతో వినియోగదారులు వాటిపై ఆసక్తి చూపించారు. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోల్చితే వీటి ధరలు, ఇంధన వ్యయం తక్కువగా ఉండటంతో సందర్శకులు ఈవీల కొనుగోలుకు ఆసక్తి చూపారు.

లక్కీడ్రా విజేతకు బహుమతి అందజేస్తున్న ఎస్సై సుమన్

బైక్‌ను టెస్ట్ రైడ్ చేస్తున్న సందర్శకుడు

రయ్.. రయ్ మంటూ టెస్ట్‌డ్రైవ్

ఆటోషోలో ప్రముఖ కంపెనీల కార్లు, బైకులను రయ్.. రయ్‌మంటూ సందర్శకులుచక్కర్లు కొట్టారు. సందర్శనకు వచ్చిన వినియోగదారులు తమకు నచ్చిన వాహనాలను టెస్ట్ డ్రైవ్ చేశారు. వాహనప్రియులు ఎక్కువగా ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నట్లుగా చేతక్ వాహనాలపై గ్రౌండ్‌లో ఓ రౌండ్ వేశారు. ఆ తర్వాత నచ్చిన కార్ల గురించి తెలుసుకుని వాటినీ నడిపారు.

హనుమకొండలోని హయగ్రీవాచారి మైదానంలో ఆటోషో స్టాళ్ల వద్ద సందర్శకుల సందడి

ఒకప్పుడు మెట్రో నగరాలకే పరిమితమైన ఆటోషోను వరంగల్ నగరంలో అందుబాటులోకి తీసుకొచ్చింది నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే. వాహన ప్రేమికుల కలను సాకారం చేసేందుకు వారికి కావాల్సిన వాహనాలను స్టాళ్లలో ప్రదర్శించగా ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. కారు, బైక్ మోడళ్ల వివరాలను ఆయా కంపెనీల ప్రతినిధుల ద్వారా అడిగి నివృత్తి చేసుకున్నారు. కొందరు ఉత్సాహంగా టెస్ట్ రైడ్ చేయగా మరికొందరు వెనువెంటనే కార్లు, బైక్‌లను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ పండిళ్ల అశోక్‌కుమార్, ఏజీఎం ఎం.రాజిరెడ్డి, బ్యూరో ఇన్‌చార్జి పిన్నింటి గోపాల్, యాడ్ మేనేజర్లు అప్పని సూరయ్య, శ్రీచరణ్ ఆనంద్, సర్క్యులేషన్ మేనేజర్ ఎడెల్లి సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.


బైక్ కొనుగోలు చేసిన మహిళకు కీ అందజేస్తున్న అడ్వర్టయిజ్‌మెంట్ జీఎం సురేందర్‌రావు

ఇలాంటి వేదికలు చాలా అవసరం

వినియోగదారులకు ప్రస్తుతం ఇలాంటి వేదికలు చాలా అవసరం. అన్ని కంపెనీలకు చెందిన వాహనాలు ఒకేచోట ఉండడం వల్ల అవసరాల ప్రకారం కొనుగోలు చేసుకోవచ్చు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు కూడా సొంత కారు కలను నెరవేర్చుకునే అవకాశం ఉంది.

– వై.రమేశ్, వినియోగదారు

'నమస్తే' బంపర్ డ్రా

స్టాళ్ల సందర్శనకు వచ్చిన వారిని ప్రోత్సహించేందుకు నమస్తే బంపర్ డ్రా ఏర్పాటు చేసింది. డ్రాలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేసింది. రోజూ లక్కీ డ్రా ద్వారా ముగ్గురికి బహుమతులు అందించింది.

ఎమ్మెల్యే కడియం శ్రీహరికి జ్ఞాపిక అందజేస్తున్న నమస్తే తెలంగాణ బ్రాంచి మేనేజర్ అశోక్‌కుమార్, చిత్రంలో పత్రిక సిబ్బంది తదితరులు

'నమస్తే' చొరవ అభినందనీయం

ప్రాపర్టీ షో, ఆటోషోలతో అందరికీ చేరువ.. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ, మార్చి 17: ఇప్పటివరకు మెట్రో సిటీలకే పరిమితమైన అత్యాధునిక వాహనాలను హైదరాబాద్ తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ నగరంలోని ప్రజలకు పరిచయం చేసేందుకు 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో ఆటోషో ఏర్పాటుచేయడం అభినందనీయమని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆటోషో ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతి స్టాల్‌ను సందర్శించి వాహనాల ప్రత్యేకతలు, పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం కడియం మాట్లాడుతూ వార్తలను ప్రచురించడమే కాకుండా ప్రజా అవసరాలను గుర్తించి గతంలో ప్రాపర్టీ షో, ఇప్పుడు ఆటోషో నిర్వహించారని, పత్రికల ఆధ్వర్యంలో ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషకరం అన్నారు. ఈ వేదిక ద్వారా నగరంలో ఉన్న కంపెనీల వాహనాలతో పాటు బెంజ్, వోల్వో, ఆడి లాంటి టాప్ మాడల్స్‌ను పరిచయం చేశారన్నారు. ఇది కస్టమర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రముఖ కార్ల కంపెనీలు, మోటర్ బైక్, ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలను ఒకే వేదికపై పరిచయం చేసి కొనుగోలుదారులు హైదరాబాద్ లాంటి నగరాలకు పరుగెత్తకుండా టాప్ మాడల్స్ బ్రాండెడ్ కార్లు బుక్ చేసుకొనే అవకాశం కలిగిందన్నారు. అనంతరం కంపెనీల ప్రతినిధులకు మెమెంటోలు అందజేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరికి మెమెంటో అందించారు.

'కియా'కు అపూర్వ ఆదరణ

కియా మోటర్స్ కంపెనీ కార్లకు తెలుగు రాష్ట్రాల్లో అపూర్వ ఆదరణ కనిపిస్తోంది. ఒకే చోట అన్నిరకాల కంపెనీలకు చెందిన వాహనాలను చేర్చడం మంచి ఆలోచన. ఇలాంటివి మరిన్ని ఏర్పాటు చేయాలి. రెండు రోజుల ప్రదర్శనలో నగరవాసులు స్టాల్స్‌ను సందర్శించి కారు ఫీచర్స్‌ను అడిగి తెలుసుకున్నారు.

– గంజి సంజీవ్, బిజినెస్ హెడ్, మాలిక్ కియా, ములుగురోడ్

ఫోక్స్‌వ్యాగన్‌పై నగరవాసుల ఆసక్తి

ఆటోషో ఏర్పాటు చేసిన నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే యాజమాన్యాలకు కృతజ్ఞతలు. ఆటోషోలో మా స్టాల్‌కు మంచి ఆదరణ వచ్చింది. చాలా మంది నగరవాసులు కొనుగోలుకు ఆసక్తి చూపారు. చాలామంది స్టాళ్లను సందర్శించారు.

– కె.ప్రవీణ్‌కుమార్, సేల్స్ మేనేజర్, పీపీఎస్ మోటర్స్ ఫోక్స్‌వ్యాగన్, హంటర్‌రోడ్

యువత ఆసక్తి చూపారు

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటోషోలో మా చేతక్ స్టాల్‌ను అనేకమంది యువకులు సందర్శించారు. మార్కెట్లో ఎంతో క్రేజ్ ఉన్నందున యువకులు భారీగా వచ్చి మా వాహనాలను టెస్ట్‌రైడ్ చేశారు. కంపెనీకి మార్కెట్లో ఉన్న ఆదరణకు తోడు ఆటోషోలో మాకు అవకాశం రావడం సంతోషం.

– టి.వెంకట్, జనరల్ మేనేజర్, చేతక్, వరంగల్

యమహా వాహనాలకు క్రేజ్

మార్కెట్లో యమహా వాహనాలకు మంచి క్రేజ్ ఉంది. యువత ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఆటోషోలో ఫ్యాసినో, ఏరోక్స్, రేజ్‌డ్ఆర్, స్కూటర్స్, ఎఫ్‌జెడ్స్ బైక్‌లు ప్రదర్శన ఉంచగా మంచి స్పందన వచ్చింది. చాలామంది మా స్టాల్‌ను సందర్శించి బైక్స్ కొనుగోలు చేయడం సంతోషం.

– మహ్మద్ రియాజ్‌పాషా, ఆథరైజ్డ్ యమహా డీలర్, హ్యాపీ ఆటోమోటివ్స్, ములుగురోడ్

మరిన్ని నిర్వహిస్తాం.

ప్రజల సౌకర్యార్థం నమస్తేతెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఆటోషోలు నిర్వహిస్తున్నాం. అన్ని జిల్లాల్లో ప్రజల నుంచి మంచి స్పందన ఉంది. అన్ని వాహనాలు ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు ఆటోషో ఏర్పాటు చేశాం. గతంలో ఇలాంటి షోలు ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహానగరాలకే పరిమితమయ్యేవి. ఇప్పుడు మన నగరాల్లో కూడా అందుబాటులోకి తెస్తున్నాం. అన్ని జిల్లాల్లో ఆటోషోలు నిర్వహించి వాహన ప్రియుల కలను సాకారం చేస్తున్నాం. ఇకముందు కూడా మరిన్ని షోలు నిర్వహిస్తాం.

– ఎన్.సురేందర్‌రావు, నమస్తే తెలంగాణ అడ్వర్టయిజ్‌మెంట్స్ జనరల్ మేనేజర్

ఆడి కారు కోసం వచ్చా..

ఆడి ఏ6 కారు కోసం వచ్చా. ఇప్పటికే ఆడి ఏ3 కారు ఉంది. అత్యాధునికమైన కార్లు అందుబాటులో ఉండటంతో తీసుకుందామని వచ్చాను. నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఆటోషోలో అన్ని వాహనాలను ఒకేచోటకు చేర్చారు. దీంతో కావాల్సిన కార్లు, బైక్‌లను కొనుగోలు చేయవచ్చు.

– బబ్బుల కిషన్‌ప్రసాద్, వ్యాపారి

తాతకు బైక్ కొందామని

నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటోషోలో మా తాతకు బైక్ కొనుగోలు చేసేందుకు వచ్చాం. అన్ని రకాల బైక్‌లు స్పెషల్ డిస్కౌంట్‌తో ఇక్కడ ఉంచారు. అన్ని షోరూంలు తిరగాల్సిన పనిలేదు. నచ్చిన వాహనాన్ని ఇక్కడే కొనుగోలు చేశాం.

– కందకట్ల నారాయణ, భరత్ (తాతా మనవడు)

నెక్సా.. అన్ని వర్గాలకు సుపరిచితం

నెక్సా కంపెనీ వినియోగదారుల అభిప్రాయాలను గౌరవిస్తుంది. వారి అభిరుచులకు అనుగుణంగా కొత్త కార్లను మార్కెట్లోకి తీసుకొస్తుంది. పల్లెల నుంచి పట్టణాల వరకు ఎవరైనా ఆదరిస్తారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే మా లక్ష్యం.

– కల్వాల శశికిరణ్‌రెడ్డి, నెక్సా షోరూం మేనేజర్, ములుగు రోడ్

వినియోగదారులకు మంచి అవకాశం

ఒకే వేదిక పైకి బైక్‌లు, కారు కంపెనీలను తీసుకురావడం అభినందనీయం. ఈ ఆటోషోలో మా గ్రీన్ హోండా స్టాల్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎంతో మంది సందర్శించారు. మా కంపెనీ రూ.7.15 లక్షల నుంచి రూ.20లక్షల వరకు ధర పలికే కార్లు ప్రదర్శనకు ఉంచాం.

– అల్లూరి పరమేశ్వర్, ఏజీఎం, గ్రీన్‌హోండా, వరంగల్

అన్నీ ఒకేచోట బాగుంది..

అన్ని మోడల్స్ కార్లు, బైక్‌లతో ఈ ప్రదర్శన బాగుంది. దీనివల్ల వాహనాలు కొనాలనుకునేవారి టైమ్ వేస్ట్ కాదు. ఒకేచోట అన్ని మోడల్స్ చూడవచ్చు. సామాన్యులు సైతం సొంత కార్లపై ఆసక్తి చూపుతున్నారు. అన్ని రకాల మోడల్స్ కారు, బైక్‌లు, వాటి వివరాలు ఒకేచోట లభించడం ప్రయోజనకరం.

– శ్రీనివాస్, నానో ఫ్యాషన్స్

కార్పొరేషన్ చైర్మన్ల నియామకంలో

ఉమ్మడి జిల్లాకు పెద్దపీట

ఆరుగురికి దక్కిన పదవులు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హనుమకొండ, మార్చి 17 : రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు పెద్ద పీట వేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 37 మందిని వివిధ కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించగా, అందులో ఉమ్మడి జిల్లాలో ఆరుగురికి అవకాశం కల్పించింది. జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియమించింది. అలాగే గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బెల్లయ్య నాయక్, స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా భూపాలపల్లికి చెందిన అయిత ప్రకాశ్‌రెడ్డి, ఎండీ రియాజ్‌కు గ్రంథాలయాల పరిషత్ చైర్మన్‌గా, ఇనుగాల వెంకట్రాంరెడ్డికి కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్‌గా, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించింది.

గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ

వనదేవతల సన్నిధిలో కోలాహలం

తాడ్వాయి, మార్చి17 : మేడారం సమ్మక్క-సారలమ్మ దర్శనానికి భక్తులు తరలివస్తున్నారు. సెలవుల్లో భక్తులు తల్లుల దర్శనానికి క్యూ కడుతున్నారు. ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మవార్ల దీవెనలు పొందారు. మొదటగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

జంపన్నవాగులో మునిగి భక్తుడి మృతి

మేడారంలో పుణ్యస్నానం చేసేందుకు జంపన్నవాగులోకి దిగి ఓ భక్తుడు మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని పోచమ్మ బస్తీకి చెందిన రాపాని రాజు(22)ఆదివారం కుటుంబ సభ్యులతో మేడారానికి వచ్చారు. స్నానాలు చేసేందుకు కొత్తూరు సమీపంలోని లోలెవల్ కాజ్‌వే వద్దకు చేరుకున్నారు. రాజు ముందుగా వాగు లోతు తెలియక దిగి మునిగిపోయాడు. పస్రా సీఐ శంకర్ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు నీలకంఠేశ్వర్, వెంకటేశ్వర్‌రావు వాగులోకి దిగి మృతదేహాన్ని వెలికితీశారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి

వరంగల్ పార్లమెంట్ ఆర్వో, కలెక్టర్ ప్రావీణ్య.. 24 గంటల పాటు గట్టి నిఘా: సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఆదివారం ఆమె వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న రానుందని, ఆ రోజు నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ, 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమైనట్లు చెప్పారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, పరకాల, భూపాలపల్లి శాసన సభ నియోజకవర్గాల్లో తుది ఓటరు జాబితా ప్రకారం 18,16,543 మంది ఓటర్లు, 977 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని తెలిపారు. అర్హులందరూ ఓటరు జాబితాలో పేరు సరిచూసుకోవాలని, జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు 1,893 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఓటరుకు 2కిలోమీటర్ల రేడియస్‌లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై టోల్‌ఫ్రీ నంబర్ 1950, కాల్ సెంటర్ నంబర్ 09702530811, సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నాలుగో విడుతలో పోలింగ్ జరుగనుందని తెలిపారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో అవసరమైన చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, 24గంటల పాటు గట్టి నిఘా ఉంచామని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదుతో ప్రయాణించొద్దని, రోజూ తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న సొమ్మును జిల్లాలోని గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పించి నగదు తీసుకెళ్లవచ్చని చెప్పారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో శ్రీనివాస్, డీపీఆర్వో అయూబ్‌అలీ, ఆర్డీవోలు పెదం దత్తు, కృష్ణవేణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్వో, కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో సీపీ అంబర్ కిషోర్ఝా